సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 12 । జూన్ । 2024



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నర్రా శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు (హైదరాబాద్) మంగళవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.85 అడుగులకు చేరింది.

గరిష్ఠం/కనిష్ఠం
38.0°/26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	35.0	27.0
కాకినాడ	35.3	27.4
అమలాపురం	38.0	26.0

ప్రతిభ చూపి.. టాప్ లేపి..



- ఏపీ ఈఏపీ సెట్‌లో మెరుపులు
- మన విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

మనోళ్లు అదరగొట్టారు.. పట్టుదల, కార్యదీక్ష, నిరంతర శ్రమతో అనుకున్న లక్ష్యాన్ని కైవసం చేసుకున్నారు. ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో తమకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు తాము వేసుకున్న బాటలో ముందుకు సాగుతామని అంటున్నారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ప్రవేశ పరీక్షలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. తద్వారా తమ తల్లిదండ్రులకు, తమ గ్రామాలకు, చదువుకున్న విద్యాసంస్థలకు పేరు ప్రఖ్యాతులు తీసుకుని వచ్చారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని తెలిపారు. తమ భవిష్యత్తు ప్రణాళికలు, లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తాం



తల్లిదండ్రులతో ఆనందం పంచుకుంటున్న 25వ ర్యాంకర్ రఘురామ సహన్



విద్యార్థి పేరు: భీమిరెడ్డి రఘురామ సహన్
ఊరు: బిక్కవోలు
ర్యాంకు: 25
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: శేషవేణి (గృహిణి), సుబ్బారావు (పాల వ్యాపారం)
లక్ష్యం: బీటెక్ చదివి, సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించడం.



51వ ర్యాంకర్ సాయినరేన్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు భానుమతి, శ్రీనివాసరావు

విద్యార్థి పేరు: బండారు సాయి నరేన్
ఊరు: వాడపాలెం, కొత్తపేట మండలం
ర్యాంకు: 51
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: భానుమతి (గృహిణి), శ్రీనివాసరావు (టీచర్, జెడ్పీ హైస్కూల్, గంటి)
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



విద్యార్థి పేరు: ప్రగళ్లపాటి వెంకట సూర్య ధనరాజ్ సాయి మోహిత్
ఊరు: ఏలేశ్వరం
ర్యాంకు: 40
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: అనురాధ (గృహిణి), కామేశ్వర రావు (వస్త్ర వ్యాపారం)
లక్ష్యం: ముంబై ఐఐటీలో సీఎస్‌సీ చదివి సాఫ్ట్‌వేర్ నిపుణుడు కావడం.

సైంటిస్టు అవుతా..



విద్యార్థి పేరు: గొల్లపల్లి ఫణీంద్ర
ఊరు: వలసపాకల, కాకినాడ రూరల్
ర్యాంకు: 47
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: సుబ్బలక్ష్మి, రామారావు
లక్ష్యం: ఫిజిక్స్‌లో రీసెర్చ్ సైంటిస్ట్

ఐఐటీ చదువుతాం..



విద్యార్థి పేరు: మారిశెట్టి సాయిచరణ్
ఊరు: సామర్లకోట
ర్యాంకు: 22
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: అనిత (తుని జెడ్పీ హైస్కూల్ టీచర్)
లక్ష్యం: ఐఐటీ



విద్యార్థి పేరు: బిక్కన రోహిత్ చౌదరి
ఊరు: ఇంద్రపాలెం, కాకినాడ రూరల్
ర్యాంకు: 57
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: ఐశ్వర్య, వెంకటరావు
లక్ష్యం: ఐఐటీ

సివిల్సే లక్ష్యం



56 ర్యాంకర్ సత్యనారాయణను అభినందిస్తున్న తల్లిదండ్రులు రమేష్, నవరజని

విద్యార్థి పేరు: గజ్జరపు సత్యనారాయణ
ఊరు: సమిశ్రగూడెం, నిడదవోలు మండలం
ర్యాంకు: 56
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: నవరజని (ఉప సర్పంచ్), శ్రీరమేష్ (వ్యవసాయం)
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఐఏఎస్



విద్యార్థి పేరు: భోజనపల్లి కల్కి సువర్ణ్
ఊరు: బండారులంక, అమలాపురం రూరల్
ర్యాంకు: 100
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: సుభద్ర (గృహిణి), నరసింహరావు (కొబ్బరి వ్యాపారం)
లక్ష్యం: ఐఐటీ, ఐఏఎస్



విద్యార్థి పేరు: రామిశెట్టి పవిత్ర
ఊరు: ఏడిద, మండపేట మండలం
ర్యాంకు: 74
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: సత్యశ్రీ (గృహిణి), శేఖర్ (రైతు), **లక్ష్యం:** ఐఐటీ, సివిల్స్



విద్యార్థి పేరు: కూళ్ల ప్రవీణ్ సిద్ధార్థ
ఊరు: కాతేరు, రాజమహేంద్రవరం రూరల్
ర్యాంకు: 76
విభాగం: ఇంజినీరింగ్
తల్లిదండ్రులు: లక్ష్మీకుమారి (హోమియో వైద్యురాలు), సూర్యనారాయణ (లెక్చరర్)
లక్ష్యం: ఐఐటీ, సివిల్స్

స్టెతస్కోప్ పడతాం..



విద్యార్థి పేరు: దామిశెట్టి సిద్ధార్థ
ఊరు: కాకినాడ
ర్యాంకు: 11
విభాగం: అగ్రికల్చర్, ఫార్మసీ
తల్లిదండ్రులు: సౌజన్య, కల్యాణ్ రవిప్రసాద్
లక్ష్యం: వైద్య విద్య



విద్యార్థి పేరు: యండమూరి నైమితారాణి
ఊరు: కాకినాడ, **ర్యాంకు:** 31
విభాగం: అగ్రికల్చర్, ఫార్మసీ
తల్లిదండ్రులు: షైనీ జోష్
లక్ష్యం: వైద్య విద్య



విద్యార్థి పేరు: దొమ్మేటి తేజస్విని
ఊరు: కొంతమూరు, రాజమహేంద్రవరం రూరల్
ర్యాంకు: 96
విభాగం: అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ
తల్లిదండ్రులు: అనురాధ (టీచర్), నాగేశ్వరరావు (టీచర్)
లక్ష్యం: ఎంబీబీఎస్



విద్యార్థి పేరు: మోటేపల్లి విశ్వంత్
ఊరు: కాకినాడ
ర్యాంకు: 79
విభాగం: అగ్రికల్చర్, ఫార్మసీ
తల్లిదండ్రులు: దుర్గాభవాని, శ్రీనివాసరావు
లక్ష్యం: వైద్య విద్య



విద్యార్థి పేరు: కొత్తలంక సాయి బాలా త్రిపురసుందరి
ఊరు: చీడిగ, కాకినాడ రూరల్
ర్యాంకు: 67
విభాగం: అగ్రికల్చర్, ఫార్మసీ
తండ్రి: వెంకటేశ్వరరావు
లక్ష్యం: వైద్య విద్య



విద్యార్థి పేరు: పైల బేబీ అభిజ్ఞ
ఊరు: రాజమహేంద్రవరం
ర్యాంకు: 87
విభాగం: అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ
తల్లిదండ్రులు: శారద (గృహిణి), సన్యాసిరావు (డీఈఈ, విద్యుత్ శాఖ)
లక్ష్యం: ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్



13వ ర్యాంకు సాధించిన రవికిరణ్‌తో ఆనందం పంచుకుంటున్న తల్లిదండ్రులు

పేరు: నిమ్మకాయల హెచ్‌డీ శరవణ సత్య రవి కిరణ్
ఊరు: పిఠాపురం
ర్యాంకు: 13
విభాగం: అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ
తల్లిదండ్రులు: వెంకటలక్ష్మి, సూరిబాబు
లక్ష్యం: ఎంబీబీఎస్



కుటుంబ సభ్యులతో ప్రభాస్

విద్యార్థి పేరు: దేశంశెట్టి ప్రభాస్
ఊరు: పశువుల్లంక, ఐ.పోలవరం మండలం
ర్యాంకు: 41
విభాగం: అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ (నర్సింగ్)
తల్లిదండ్రులు : లీలా సత్యవాణి, వెంకటేశ్వరరావు (సీఐ, విజయవాడ)
లక్ష్యం: డాక్టర్



54వ ర్యాంకర్ సాయిమనోజ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

విద్యార్థి పేరు: గ్రంధి సాయి మనోజ్
ఊరు: కడియపులంక, కడియం మండలం
ర్యాంకు: 54
విభాగం: అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ
తల్లిదండ్రులు: మాధవీలత (గృహిణి), నాగబాబు (నర్సరీ రైతు)
లక్ష్యం: ఎంబీబీఎస్, న్యూరాలజీలో స్పెషలైజేషన్



విద్యార్థి పేరు: పి.లిఖిత
ఊరు: లక్కవరం, మలికిపురం మండలం
ర్యాంకు: 65
విభాగం: అగ్రికల్చరల్
తండ్రి: శ్రీనివాసరావు, **లక్ష్యం:** ఎంబీబీఎస్

న్యూస్‌రీల్

ఈఏపీసెట్‌లో కోనసీమ విద్యార్థుల ప్రతిభ

రాయవరం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ 2024లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 3,105 మంది దరఖాస్తు చేసుకోగా, 3,040 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,330 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో 1,359 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1,244 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు, వీరిలో 1,115 మంది అర్హత సాధించారు.

ట్రాఫిక్ మళ్లింపు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రిగా చంద్రబాబు, కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా వీవీఐపీల భద్రత దృష్ట్యా జిల్లాలో ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ సునరావు శ్రీధర్ తెలిపారు. జిల్లా నుంచి భారీ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. విశాఖపట్నం నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను కత్తిపూడి, కాకినాడ, యానాం, అమలాపురం, బోడసకుర్రు, చించినాడ మీదుగా ఒంగోలు వైపు దారికి మళ్లిస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను రావులపాలెం, సిద్ధాంతం, పెరవలి మీదుగా మళ్లించినట్లు తెలిపారు.

16 నుంచి బాల బాలాజీ కల్యాణోత్సవాలు

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువైన బాల బాలాజీ స్వామి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలను ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవం 17వ తేదీ రాత్రి 8.59 గంటలకు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తంలో జరుగుతుందన్నారు. 16 ఉదయం సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేనారాధనతో కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, సహస్రనామార్చన నిర్వహిస్తామన్నారు. 18వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు వేద పండిత సదస్సు, 19వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామి వారికి చక్రస్నానం, 20న ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, ఋత్విక్ సన్మానంతో స్వామి వారి కల్యాణోత్సవాలు సంపూర్ణమవుతాయన్నారు. కల్యాణోత్సవాలు జరిగే ఐదు రోజులూ పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

విధ్వంసం చేయడానికే అధికారం ఇచ్చారా!

- శిలాఫలకాల ధ్వంసం ఎంతవరకు సమంజసం
- కూటమి అరాచకాలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



చెముడులంకలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్రంలో విధ్వంసం చేయడానికే ప్రజలు మీకు అధికారమిచ్చారా అని కూటమిని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలమూరు మండలం చెముడులంకలో టీడీపీ, జనసేన శ్రేణులు విధ్వంసానికి పాల్పడడం దారుణమన్నారు. గ్రామంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, వైఎస్సార్ సీపీ నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వారి వైఖరిని ఆయన ఖండించారు. విజయోత్సవాల పేరిట మహిళలతో కూడా దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. తమ పార్టీకి చెందిన సర్పంచ్ తమ్మన ఇంటి వద్ద కూటమి కార్యకర్తలు భారీ ఎత్తున బాణసంచా కాల్చడం, బైక్‌ల సైలెన్సర్లు విప్పి భారీ శబ్దాలు చేయడం వారి అరాచకాలకు నిదర్శనమన్నారు. కూటమి చర్యలతో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధైర్యపడవద్దన్నారు. ఆ దాడులను ఎదుర్కొనేందుకు మాజీ సీఎం జగన్ ప్రత్యేక లీగల్ సెల్‌ను ఏర్పాటు చేశారన్నారు. గ్రామంలో శిలాఫలకాలను ధ్వంసం చేయడాన్ని ఏ విధంగా సమర్థించుకుంటారో అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు చెప్పాలన్నారు.

గెలుపు ఓటములు సహజం

ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గతంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన తాను ఏనాడు హింసను ప్రోత్సహించలేదన్నారు. కనీసం విజయోత్సవాలు కూడా జరపలేదని, నియోజకవర్గ అభివృద్ధికే నిరంతరం శ్రమించనన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దౌర్జన్యాలు, దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నల్లి రాజు, పెంటపాటి వెంకట్రావు, దొండపాటి వీర వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

- కార్యకర్తలకు అండగా ఉండండి
- వైఎస్సార్ సీపీ అధినేత జగన్
- తాడేపల్లిలో జననేతను కలిసిన జిల్లా నాయకులు



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలసిన మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నేతలు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మేడపాటి షర్మిలారెడ్డి

రాజానగరం/పెదపూడి: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని, కార్యకర్తలకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ అధినేత, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ జిల్లా నాయకులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నేతలు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో అధినేత జగన్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనపర్తి నియోజకవర్గంలో అధికార టీడీపీ, బీజేపీ శ్రేణులు చేస్తున్న దౌర్జన్యాలను, అరాచకాలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఓటమి పాలు కావడానికి కారణాలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల మీద జరుగుతున్న దాడులపై జగన్ ఈ సందర్భంగా చర్చించారు. ఎన్నికల్లో గెలిచి, ప్రజా సేవ చేయాల్సిన సమయంలో గెలిచిన అహంకారంతో దాడులకు పాల్పడుతున్నారని రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి వివరించారు. అనపర్తిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా టీములను లక్ష్యంగా చేసుకుని, వారి ఇళ్లపై దాడులు చేసి, భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. హత్యాయత్నాలకు పాల్పడుతూ ఫోన్ ద్వారా బెదిరించి, వారి వద్దకు రప్పించుకుని దాడులు చేసి, సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, గెలుపు, ఓటములు శాశ్వతం కావని, ఓటమి ఎదురైనా ధైర్యంగా నిలబడాలని నేతలకు సూచించారు. ఎవరూ బాధ పడాల్సిన అవసరం లేదని, ప్రజాతీర్పును గౌరవిస్తూనే పోరాటం చేయడమే మన ముందున్న కర్తవ్యమని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులపై అధికార పార్టీ చేస్తున్న దాడులపై న్యాయపరంగా పోరాడాలని, బాధితులకు అండగా నిలబడాలని నేతలకు జగన్ సూచించారు. ప్రతి బాధితుడినీ ప్రత్యక్షంగా కలుస్తానని జగన్ చెప్పారని డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

చిక్కవు.. దొరకవు

- చేపల కోసం ప్రజల ఎదురుచూపు
- సముద్రంలో వేట నిషేధం అమలు
- నదీపాయలలో తగ్గిన లభ్యత

సాక్షి అమలాపురం: ఒక వైపు సముద్రంలో వేట నిలిచిపోయింది. గంగపుత్రులకు రోజు గడవని పరిస్థితి. మరోవైపు మృగశిర మాసం వచ్చేసింది. మాంసాహార ప్రియులకు రుచికరమైన చేపను ఆహారంగా తీసుకోవడం ఆనవాయితీ. ప్రస్తుతం చెరువు చేప, నదీ పాయల మధ్య దొరికే చేపలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సముద్ర చేపకు ప్రత్యామ్నాయంగా చెరువు చేప వినియోగం పెరిగినా.. ఉన్న కొద్దిపాటి ధర తగ్గడంతో చేపల రైతులు లబోదిబోమంటున్నారు. ఇలా చేప చిక్కక అటు మత్స్యకారులు, మాంసాహార ప్రియులు వాపోతున్నారు.

జూన్ 15 వరకూ వేట నిషేధం

మత్స్య క్రమబద్ధీకరణ చట్టంలో భాగంగా జిల్లాలో సముద్ర వేట నిలిచిపోయింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 తేదీ వరకూ సుమారు 61 రోజులు వేట ఆగింది. ఈ సమయంలో చేపలు, ఇతర సముద్ర జీవాల పునరుత్పత్తి జరిగే అవకాశమున్నందున కన్యాకుమారి నుంచి కోల్‌కతా వరకూ వేటను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. గతంలో అంగుళం, అర అంగుళం వలలతో వేట చేయడం వల్ల చిన్న చేపలు తప్పించుకునేవి. ప్రస్తుతం రింగు వలలు (సూక్ష్మ కన్నాలు ఉండే వల) వాడుతుండడంతో చిన్న చేపలు కూడా వేటకు దొరకుతున్నాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వేట నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తోంది.

నిలిచిన బోట్లు

జిల్లాలోని అంతర్వేది పల్లిపాలెం నుంచి ఐ.పోలవరం మండలం భైరవపాలెం వరకూ విస్తారంగా ఉన్న సముద్ర తీరం పొడవునా వేట సాగుతుంది. జిల్లాకు చెందిన మత్స్యకారులతో పాటు విశాఖపట్నం జిల్లా నక్కపల్లి, అడ్డరోడ్డు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వలస మత్స్యకారుల సైతం వేటలో పాల్గొంటారు. సుమారు 1,700 బోట్లతో స్థానిక మత్స్యకారులు వేటాడుతున్నారు. పది వేల మంది వరకూ మత్స్యకారులు ప్రత్యక్షంగా సముద్ర వేట చేస్తున్నారని అంచనా. జిల్లాలోని ఏడు మండలాలలో 45 తీర ప్రాంత గ్రామాలు ఉన్నాయి. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం, అల్లవరం మండలం ఓడలరేవు, నక్కా రామేశ్వరం, మామిడికుదురు మండలం కరవాక, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, ఎస్.యానాం, కాట్రేనికోన మండలం చిర్రయానాం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, భైరవపాలెం, గాడిమొగ గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్ర వేటకు వెళతారు.



గోదావరి నదీపాయల్లో సాగుతున్న వేట



చేపల చెరువులలో పట్టుబడులు



కాట్రేనికోన మండలం చిర్రయానాం పర్ర భూముల్లో వేట

తగ్గిన చెరువు చేప ధర

గత నెలలో చెరువు చేపకు మంచి డిమాండ్ వచ్చింది. స్థానిక వినియోగం, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కారణంగా చెరువు చేప ధర కేజీ రూ.104 వరకూ పెరిగింది. అయితే దీని ధర ప్రస్తుతం కేజీ రూ.96కు తగ్గింది. ఈ సీజన్‌లో హెచ్చుధర ఉంటోందని భావించిన రైతులు.. ధర తగ్గడంతో కొంత నిరుత్సాహంతో ఉన్నారు. జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో చేపల సాగు జరుగుతోందని అంచనా. ఉత్తరాది రాష్ట్రాలైన పశ్చిమ బంగా, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశాలకు ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున చేప రవాణా జరుగుతోంది. స్థానిక మార్కెట్‌తో పాటు హైదరాబాద్, విజయవాడలకు ఇక్కడ నుంచి చేప రవాణా జరుగుతోంది.

గిట్టుబాటు కాక..

ఇటీవల సాగు పెట్టుబడులు, చెరువు లీజులు పెరిగిన నేపథ్యంలో చేప సాగు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదే సమయంలో చేప దిగుబడి (చేపల బరువు) సైతం అనుకున్న స్థాయిలో రావడం లేదు. గతంలో పంట కాలంలో చేప బరువు కేజీ నుంచి 1.50 కేజీల వరకు వచ్చేది. ఇప్పుడు 800 గ్రాముల నుంచి 1.20 కేజీల వరకు వస్తోందని చేపల రైతులు చెబుతున్నారు. పట్టుబడి జరిగిన తరువాత పెద్ద చేప, చిన్న చేపల మధ్య వ్యత్యాసం 80:20 ఉంటోంది.

మీనం.. ఔషధం

చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదని ఎప్పటి నుంచో వైద్యులు చెబుతున్న విషయం తెలిసిందే. ఈ కారణంగానే చేపలకు డిమాండ్ పెరిగింది. మరీ ముఖ్యంగా మృగశిర కార్తి రోజులలో చేపలు తినడం ఆరోగ్యానికి మేలని నమ్మకం. ఈ కార్తిలో తొలకరి వర్షాలు ఆరంభమవుతాయి. వాతావరణం ఒక్కసారి చల్ల బడటం, ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకునే నేపథ్యంలో అనేక రకాల చెడు సూక్ష్మ క్రిములు వంటివి పునరుత్పత్తి అవుతాయి. రోగ నిరోధక శక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి. చేపలు ఆహారంగా తీసుకోవడం వల్ల వాటి నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపితమైంది. హైదరాబాద్‌లో ఇటీవల చేప మందు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. చేపలలోని ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ వల్ల గుండెకు చాలా ఆరోగ్యం. ఇది రక్తం గడ్డకట్టడాన్ని తగ్గిస్తోంది. మెదడులో గ్రే మ్యాటర్ మెరుగువతోంది. దృష్టి లోపం, అంధత్వాన్ని తగ్గిస్తోంది. ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ సమ్మేళనాలతో కొలెస్ట్రాల్ బిల్డింగ్ లిపిడ్‌లను నియంత్రిస్తోంది.

పర్రభూముల్లో తగ్గిన మత్స్య ఉత్పత్తి

ఏప్రిల్ 15 నుంచి సముద్ర వేట నిషేధం కారణంగా మాంసాహారులు చెరువు చేప మీదనే అధికంగా ఆధారపడుతున్నారు. ఈ సమయంలో గోదావరి నదీపాయలు, మురుగు నీటి కాలువలు, తీరంలో సహజ సిద్ధంగా ఏర్పడే సాంప్ (పర్ర భూములు)లలో దొరికే మత్స్య సంపద మార్కెట్ అవసరాలను తీరుస్తోంది. అయితే కూనవరం స్ట్రైట్ కట్, రామేశ్వరం మొగలు పూడుకుపోవడం వల్ల పర్ర భూములల్లో మూడొంతుల మత్స్య సంపద అందుబాటులో లేకుండా పోయింది. దీనితో గోదావరి పాయలలో దొరికే మత్స్య సంపద మాత్రమే మార్కెట్‌కు వస్తోంది. ఇది కూడా స్థానిక అవసరాలను పెద్దగా తీర్చడం లేదు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి: ఆర్టీసీ బస్సు ఢీకొని మోటారు సైకిలిస్టు మృతి చెందాడు. కిర్లంపూడిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన చాగంటి కొండలరావు (73) వడ్డీ వ్యాపారంతో పాటు వ్యవసాయం చేస్తుంటాడు. జగ్గంపేట మండలం నరేంద్రపట్నంలోని తన కుమార్తె ఇంటి నుంచి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కిర్లంపూడి మీదుగా తన స్వగ్రామానికి వెళుతున్నాడు. స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలోని రోడ్డు మలుపు వద్ద అతడిని ప్రత్తిపాడు నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. బస్సు ముందు చక్రం కొండలరావు తలపై నుంచి వెళ్లపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పశు సంవర్ధకశాఖ అధికారుల నుంచి అనుమతులు లేకుండా పశువులను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఒకే వాహనంపై పరిమితికి మించి పశువులను తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బక్రీద్ రోజు గోవధ నిషేధమన్నారు.

అన్నదాతకు సిరుల జల్లు

- వెదజల్లు సాగుతో ఎన్నో లాభాలు
- వరి నాట్లకు ప్రత్యామ్నాయం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



ఎస్.విజయకుమార్, కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజల ప్రధానం వృత్తి వ్యవసాయం. సారవంతమైన భూమి, సాగు నీటి వనరులు, శ్రామిక శక్తి సంపూర్ణంతో ఉండడంతో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ముందుకు సాగుతోంది. దీనికి ప్రభుత్వం ప్రోత్సాహం తోడు కావడంతో వ్యవసాయం పండగలా మారింది. జిల్లాలో ప్రధానంగా వరిని అత్యధికంగా పండిస్తారు. గతంలో నాట్ల విధానంలో రైతులు సాగు చేసేవారు. ఇప్పుడు వెదజల్లు పద్ధతిని పాటిస్తున్నారు. నాట్ల కంటే వెదజల్లు విధానంలో ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ తెలిపారు. దీనిపై రైతులకు అనేక సలహాలు, సూచనలు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

ఎంతో ప్రయోజనం



వెదజల్లు సాగు కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు



పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

సాధారణంగా రైతులు వరి సాగు కోసం ముందుగా నారుమళ్లు తయారు చేస్తారు. అనంతరం నారు కూలీలలో పొలంలో నాటిస్తారు. ఇది సాధారణంగా అందరూ పాటించే పద్ధతి. దీని వల్ల విత్తనం ఎక్కువ అవసరమవుతుంది. ఈ విధానంలో విత్తనాలను తీసుకువచ్చి నారుమళ్లు వేస్తారు. నారు పెరిగిన తర్వాత నాట్ల కోసం కూలీల ఖర్చు పెరుగుతుంది. ఈ పద్ధతిలో వరి ఆలస్యంగా కోతకు వస్తుంది.

మన నేలలు అనుకూలం

దీనికి భిన్నంగా విత్తనాలను నేరుగా పొలంలో చల్లే పద్ధతినే వెదజల్లు సాగు అంటారు. మడులను సమాంతరంగా చదును చేసుకొని కొద్దిపాటి నీరు ఉంచి విత్తనాన్ని చల్లుతారు. దీనివల్ల ఎకరాకు 10 నుంచి 15 కిలోల వరకూ విత్తనం ఆదా అవుతుంది. ఈ పద్ధతిలో సాగు చేసిన పొలం మామూలుగా కంటే 15 రోజుల ముందుగా కోతకు వస్తుంది. దిగుబడి కూడా ఎకరానికి 10 నుంచి 15 శాతం అధికంగా పొందవచ్చు. వెదజల్లు పద్ధతిలో సాగు చేయడానికి నేల స్వభావం చాలా ముఖ్యం. చౌడు, ముంపునకు గురయ్యే నేలలు తప్ప మిగిలినవన్నీ అనుకూలంగా ఉంటాయి. జిల్లాలో నల్లరేగడి, ఎర్రమట్టి నేలలు అధికంగా ఉంటాయి. కాబట్టి ఈ సాగు పద్ధతి మన నేలలకు బాగా సరిపోతుంది.

జాగ్రత్తలు ఇవే..

వెదజల్లు సాగుకు ముందుగా పొలంలో ఎత్తు పల్లాలు లేకుండా సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత నీరు ఎక్కువగా నిల్వ ఉండకూడదు. నీరు బయటకు పోయే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. కాండం గట్టిగా, వేరు వ్యవస్థ ధృఢంగా ఉండి, పడిపోని రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. ఈ విధానంలో ఒక్క ఎకరానికి 10 నుంచి 15 కిలోల విత్తనాలు సరిపోతాయి. ముందుగా విత్తనాలను ఒక గోనె సంచిలో వేసి 24 గంటలు నానబెట్టాలి. ఆ తర్వాత మరో 24 గంటలు నీడలో మండె కట్టాలి. అనంతరం ముక్కు పగిలిన విత్తనాలను మాత్రమే దమ్ము చేసిన పొలంలో సమానంగా ఒక తాడు సహాయంతో చల్లుకోవాలి.

లాభాలివే..

- వెదజల్లు సాగులో కూలీల కొరతను అధిగమించవచ్చు. అలాగే పెట్టుబడి కూడా తగ్గుతుంది.
- ఎకరాకు రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకూ ఆదా అవుతాయి.
- విత్తనాలను ఎకరాకు 10 నుంచి 15 కిలోల వరకూ ఆదా చేసుకోవచ్చు.
- నేరుగా చల్లడం వల్ల పిలకల సంఖ్య పెరిగి, ఎకరాకు 10 నుంచి 15 శాతం దిగుబడి అధికంగా వస్తుంది.

నీటి యాజమాన్యం

వెదజల్లు సాగుకు నీటి యజమాన్యం చాలా కీలకం. విత్తనాలు చల్లిన నాటి నుంచి వారం, పది రోజుల వరకూ నీటిని ఎక్కువగా నిల్వ ఉంచకూడదు. నీరు నిల్వ ఉంటే మొలక శాతం తగ్గిపోతుంది. ఆ తర్వాత పిలకలు తొడిగే దశ వరకు నీరు పలుచగా పెట్టాలి. వరి పొట్ట దశలో ఉన్నప్పుడు సాధారణంగా నాట్లు వేసిన పొలం మాదిరిగా నీటి యాజమాన్యం పాటించాలి.

కలుపు ఎక్కువే..

సాధారణ సాగుతో పోల్చితే ఈ పద్ధతిలో కలుపు అధికంగా ఉంటుంది. రైతులు విత్తనాలు వేసిన వెంటనే ఫెర్టిలాక్లోర్‌ను ఎకరాకు 800 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి. 8 నుంచి 10 రోజుల తర్వాత ఆక్సోడైజిల్ 40 గ్రాములు ఎకరాకు చల్లాలి. 15 రోజుల తర్వాత ఊద, ఒడిపిలిని గమనిస్తే ఎకరాకు ఫినాక్సిప్రోప్-ఇథైల్ 300 మిల్లీలీటర్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 20 రోజుల తర్వాత వెడల్పాటి, గడ్డి జాతి కలుపును గమనిస్తే ఫినాక్సిలామ్‌ను చల్లాలి.

పండగలా పాఠశాలల పునఃప్రారంభం



జి.నాగమణి, విద్యాశాఖ ఆర్‌జేడీ

రాయవరం: పాఠశాలల పునఃప్రారంభాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి పిలుపునిచ్చారు. సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులకు మంగళవారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆమె ఆదేశాలు జారీ చేశారు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 13న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, అందుకు పాఠశాలలను సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులందరూ బుధవారం పాఠశాలలకు వెళ్లి, పునఃప్రారంభానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, చెత్తా చెదారాన్ని తొలగించాలని, మధ్యాహ్న భోజన పథకం వంటపాత్రలను శుభ్రం చేయించాలని, మరుగుదొడ్లు శుభ్రం చేయడంతో పాటుగా, రక్షిత తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కుకింగ్ కమ్ హెల్పర్లతో సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఇకపై విద్యా కానుక కిట్లను స్టూడెంట్ కిట్లుగా పరిగణించాలని ఆమె సూచించారు.

చైల్డ్ ఇన్ఫో ప్రకారం ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్ అందే విధంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలలో ఒకటో తేదీలో చేర్చే విధంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, దీనిపై ఎంఈవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ నెల 13 నుంచి పాఠశాల స్థాయిలో నిర్వహించే మేరీలైఫ్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును పరిశీలించాలన్నారు.

15 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- ముగ్గురి అరెస్టు, వ్యాన్ సీజ్
- బియ్యం విలువ రూ.11 లక్షలు

జగ్గంపేట: అక్రమంగా తరలిస్తున్న 15 టన్నుల రేషన్ బియ్యాన్ని జగ్గంపేట శివారున మంగళవారం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. జగ్గంపేట సీఎస్‌డీటీ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బి.లచ్చబాబు 15,250 కేజీల రేషన్ బియ్యాన్ని 305 బస్తాలలో నింపి జగ్గంపేట మండలంలోని కోళ్లఫారాలకు తరలిస్తున్నాడు. దీని కోసం గ్రామంలోని వెలుగు గంగరాజుకు చెందిన వాహనాన్ని వినియోగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో డ్రైవర్ నామాల వీరబాబుతో కలిసి వాహనంలో జగ్గంపేటకు బియ్యం తీసుకువస్తుండగా ముందస్తు సమాచారంతో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. సుమారు 11 లక్షలు విలువ చేసే బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై 6ఏ కింద కేసు నమోదు చేశారు. అలాగే వారిని జగ్గంపేట పోలిసు స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎన్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ రీజియన్ పరిధిలోని మూడు జిల్లాలలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా ఉంచామన్నారు.



రేషన్ బియ్యం, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

బియ్యం కొనుగోలు చేసినా, అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారులు భార్గవ, మహేష్, వల్లి, వీరబాబు, సీఎస్‌డీటీ కృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మరో 500 కేజీల బియ్యం స్వాధీనం

జగ్గంపేట శివారు రంగవల్లి నగర్ వద్ద ఆటోలో తరలిస్తున్న 500 కేజీల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి మండలం రామచంద్రాపురం నుంచి జగ్గంపేట వైపునకు ఆటోలో తరలిస్తుండగా డిప్యూటీ తహసీల్దార్ జి.మురళీమోహన్ పట్టుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

బోనులో చిక్కిన భారీ మానుపిల్లి

మామిడికుదురు: నగరం గ్రామంలోని తాటిపాక జీసీఎస్‌లో మూడు నెలలుగా ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్న భారీ మానుపిల్లి మంగళవారం ఎట్టకేలకు బోనులో చిక్కింది. జీసీఎస్‌లో కేబుళ్లను కట్ చేస్తూ, భయంకరమైన శబ్దాలతో రాత్రి సమయంలో ఈ మానుపిల్లి జీసీఎస్ ఉద్యోగులను కలవరపెడుతోంది. దాని కోసం బోను ఏర్పాటు చేశారు. ముందుగా మానుపిల్లి పిల్ల చిక్కింది. దాన్ని బోనులో ఎరగా వేయడంతో ఐదేళ్ల వయసున్న భారీ మానుపిల్లి కూడా చిక్కిందని జీసీఎస్ రెసిడెంట్ ఇంజినీర్ రిషికేష్ రెడ్డి తెలిపారు. మానుపిల్లిని అమలాపురం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆర్‌వీ రమణ ఆధ్వర్యంలో సిబ్బందికి అప్పగించారు.



తాటిపాక జీసీఎస్‌లో బోనులో చిక్కిన మానుపిల్లి

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కె.గంగవరం: కోటిపల్లిలోని గౌతమి గోదావరిలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో కె.గంగవరం పోలీసులు సంఘటనా స్థలానికి మృతదేహాన్ని పైకి తీశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై జానీ బాషా మాట్లాడుతూ మృతుడికి సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు ఉంటుందని, కుడిచేతికి తాడు కట్టి ఉందన్నారు. ఒంటిపై తెలుపు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు 08857 255033 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జూలై 20న ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గం ఎన్నికలను వచ్చే జూలై 20న నిర్వహించనున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల అధికారి, కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఈ మేరకు అమలాపురంలోని ఆ బ్యాంక్ బ్రాంచ్ ద్వారా మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జూలై 11న నామినేషన్ల స్వీకరణ, 13న ఉప సంహరణ, 20న ఎన్నికలు జరుగుతాయన్నారు. అర్హులైన ఓటర్ల తుది జాబితాను జూలై 4వ తేదీన ప్రకటించేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు.

ఘనా దేశంతో వాణిజ్య సంబంధాలు



ఢిల్లీలో ఘనా మంత్రి ఎర్నెస్ట్ నానా అదేజేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ కేవీ రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఆఫ్రికాలోని ఘనా దేశానికి ఎగుమతులు, దిగుమతుల విషయంపై ఆ దేశ వాణిజ్య, ఆర్థిక సంబంధాల మంత్రి ఎర్నెస్ట్ నానా అదేజేతో చర్చించినట్లు ఆంధ్రప్రదేశ్ రీజియన్ ఘనా ట్రేడ్ కమిషనర్ డాక్టర్ కేవీ రెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన కేవీ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలోని ఘనా హైకమిషన్‌లో ఈ మేరకు చర్చలు జరిపారు. ఆ దేశానికి బియ్యం, చిరుధాన్యాల ఎగుమతులతో పాటు, అక్కడి నుంచి జీడిపప్పు, కలప దిగుమతులపై మాట్లాడారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రతినిధుల బృందం ఘనాను సందర్శించాల్సి ఉంటుందని కేవీ రెడ్డి తెలిపారు. అలాగే మన రాష్ట్రంలో ఆగస్టులో జరిగే ట్రేడ్ మీటింగ్‌లో పాల్గొనేందుకు ఘనా మంత్రిని ఆహ్వానించామన్నారు.

యోగా కోర్సులో ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ద్వారా పీజీ డిప్లమా ఇన్ యోగా కోర్సులో చేరేందుకు గడువును ఈ నెల 30 వరకూ పొడిగించామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. కానవరంలోని రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా సహకారంతో పార్ట్ టైమ్ కోర్సుగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, అపరాధ రుసుముతో జూలై 8 వరకూ అవకాశం ఉందన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

చేపల లోడు వ్యాన్ బోల్తా

గండేపల్లి: టైరు పేలిపోవడంతో వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. రోడ్డు సేఫ్టీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మినీ వ్యాన్ మంగళవారం ఆకివీడు నుంచి విశాఖపట్నానికి చేపల లోడుతో బయలుదేరింది. గండేపల్లి మండలం మల్లేపల్లి శివారు బ్రిడ్జిపైకి వచ్చేసరికి టైరు పేలిపోయింది. దీంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే గండేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో చేపల లోడును మరో వ్యాన్‌లోకి ఎక్కించి పంపించారు. బోల్తా పడిన వాహనాన్ని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జూలై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సుప్రీంకోర్టులో జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ ప్రత్యేక లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం తెలిపారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. అలాంటి కేసుల వివరాలను న్యాయవాదులు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం కక్షిదారులు, న్యాయవాదులు టోల్ ఫ్రీ నంబర్ 15100ను లేదా, సమీప కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

స్కేటింగ్ పోటీలలో హన్షిత్ ప్రతిభ

అంబాజీపేట: నేషనల్ ర్యాంకింగ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ స్పీడ్ స్కేటింగ్ పోటీలలో ఇసుకపూడి శివారు పెండిపేటకు చెందిన ఆరేళ్ల కుంచే హన్షిత్ గోల్డ్ మెడల్ సాధించాడు. రాయపూర్‌లో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకూ ఈ పోటీలు జరిగాయి. 5 నుంచి 7 ఏళ్ల వయసున్న బాలుర స్కేటింగ్ పోటీలలో హన్షిత్ పాల్గొన్నాడు. రింక్ – 111 (3 లాప్)లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. అలాగే రింక్ – 11 (2 లాప్)లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నాడు. తల్లిదండ్రులు కుంచే రమేష్, శ్వేత మాట్లాడుతూ హన్షిత్‌కు స్కేటింగ్‌లో చంటి కృష్ణ శిక్షణ ఇచ్చారన్నారు. కాగా.. ఆరేళ్ల వయసులోనే నేషనల్ చాంపియన్ షిప్ సాధించిన హన్షిత్‌కు పలువురు అభినందనలు తెలిపారు.



తల్లిదండ్రులు రమేష్, శ్వేతలతో హన్షిత్

విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

గొల్లప్రోలు: వ్యవసాయాధికారులు డాక్టర్ బీవీఎస్ హరి, జీబీ కరణాకర్ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లప్రోలు, తాటిపర్తిలోని విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లో తేడాలుండడంతో రూ.4,89,108 పత్తి విత్తన ప్యాకెట్ల అమ్మకాలను నిలుపుదల చేశారు. బీవీఎస్ హరి మాట్లాడుతూ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణ యజమానులు తమ లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలను పాటించని డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో వ్యవసాయాధికారి ఎం.వెంకటలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గోదావరి తీరంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్





మాక్‌డ్రిల్‌లో భాగంగా గోదావరిలో తిరగబడుతున్న బోటు, బాధితులను ఒడ్డుకు తీసుకు వస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

మామిడికుదురు/అమలాపురం టౌన్: పాశర్లపూడి బాడవలోని వైనతేయ గోదావరి తీరంలో బోటు ప్రమాదం.. మద్యం సేవించి బోటుపై షికారుకు వెళ్లిన బృందం.. నదిలో ఒక్కసారిగా తిరగబడిన బోటు.. మునిగిపోతున్న వారి ఆర్తనాదాలు.. రక్షించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం.. దీన్ని చూసి ప్రజలు తొలుత కంగారు పడ్డారు. అయితే ఇది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం నిర్వహించిన మాక్‌డ్రిల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన సందర్భంలో బాధితులను రక్షించడంపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం పాశర్లపూడి బాడవ గోదావరి తీరంలో మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. బోటు తిరగబడి, నదిలో మునిగిపోతున్న వారిని రక్షించి ఒడ్డుకు తీసుకు రావడం, వారికి ప్రథమ చికిత్స అందించడం వంటి వాటిని ప్రదర్శించింది. తహసీల్దార్ ఎం.మేరికమ్మ దగ్గరుండి ఈ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించారు. సుమారు రెండు గంటల పాటు సేపు జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ 10వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ప్రదీక్ కుమార్ పర్యవేక్షణలో 26 మంది సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

అయినవిల్లి: మండలంలోని నేదునూరు అశోక్ నగర్‌కు చెందిన బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై వి.రాజేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేదునూరు అశోక్ నగర్‌కు చెందిన పరమట రాజశేఖర్ అదే గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి అమలాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

తిరుమల విద్యాసంస్థల విజయకేతనం



ఎన్ రాధాకృష్ణ, అగ్రి అండ్ ఫార్మసీ (10)



సంపత్ నాయుడు, అగ్రి అండ్ ఫార్మసీ (28)



డి.ప్రభాస్, అగ్రి అండ్ ఫార్మసీ (41)



సాకేత్ రాఘవ్, అగ్రి అండ్ ఫార్మసీ (43)



సాయి నరేన్, ఇంజనీరింగ్ (51)



జి.సత్యనారాయణ, ఇంజనీరింగ్ (56)



ఆర్.పవిత్ర, ఇంజనీరింగ్ (74)



కె.ప్రవీణ్ సిద్ధార్థ్ ఇంజనీరింగ్ (76)

రాజమహేంద్రవరం రూరల్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మశీ (ఏపీఈఏపీ) సెట్‌లో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు సంచలన విజయం సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో ఎన్.రాధాకృష్ణ 10, పీఎస్ సంపత్ నాయుడు 28, డి.ప్రభాస్ 41, ఎస్.సాకేత్ రాఘవ్ 43, పి.బేబీ అభిఘ్న 87, డి.తేజశ్విని 96, టి.జనన్య 97, ఆర్ఎల్ నాగ వెంకట దుర్గాప్రసాద్ 100వ ర్యాంకులు సాధించారన్నారు. అలాగే 60 మంది వెయ్యిలోపు, 90 మంది 2వేల లోపు, 197 మంది 5వేల లోపు, 311 మంది 10,000లోపు ర్యాంకులు సాధించారన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో బి.సాయి నరేన్ 51, జి.సత్యనారాయణ 56, ఆర్.పవిత్ర 74, కె.ప్రవీణ్ సిద్ధార్థ్ 76 ర్యాంకులలో నిలిచారన్నారు. 119 మంది 1000లోపు, 252 మంది 2000 లోపు, 562 మంది 5000 లోపు, 865 మంది 10,000లోపు ర్యాంకులు సాధించారన్నారు. ఈ విజయాలకు కారణమైన అధ్యాపకులను, విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.